



బీర్కూర్‌లో రైస్‌మిల్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆరు రోజుల పాటు
ధాన్యం లారీ నిలిపివేత

- ధాన్యం దించుకోకుండా రైతులకు వేధింపులు
- రైస్‌మిల్లర్ వ్యవహారశైలిపై రైతుల ఆగ్రహం
- రైస్‌మిల్‌లో రైతుల ఆందోళన

బీర్కూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎండనక, వాననక ఆరుగాలం కష్టపడి రైతులు వరి పంటలను సాగు చేశారు. ఈ సీజన్‌లో వర్షాలు భారీగా కురియడం వల్ల పంట దిగుబడి సగానికి సగం తగ్గింది. పంటకు పెట్టిన పెట్టుబడి సైతం రాబట్టుకోలేని పరిస్థితి దాపురించింది. వర్షాల కారణంగా వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదిలా ఉంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 2 నుంచి 3 కిలోల తరుగు తీస్తున్నారు. మరోవైపు ధాన్యం కాంటా చేసి రైస్‌మిల్లులకు పంపిస్తే అక్కడ కూడా రైస్‌మిల్లర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఊరూరా తిరుగుతూ చెబుతున్నా రైస్‌మిల్లర్లు మాత్రం అవేమీ పట్టించుకోకుండా తమ ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు.


ఆరు రోజుల పాటు ధాన్యం దించుకోకుండా..

నసురుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన రైతులు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని విక్రయించారు. సంఘం సిబ్బంది అన్ని విధాల ధాన్యాన్ని పరీక్షించి ధాన్యాన్ని తూకం వేశారు. అనంతరం ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేసి ట్రక్ షీట్ ఇచ్చి బీర్కూర్‌లోని ఒక రైస్ మిల్లుకు తరలించారు. అయితే రైస్‌మిల్లు సిబ్బంది లారీని లోపలికి అనుమతించకుండా బయటే నిలిపివేశారు. ధాన్యం మొలకెత్తిందని ఆరోపిస్తూ ఆరు రోజుల పాటు లారీని లోపలికి అనుమతించలేదు. దీంతో రైతులు రైస్‌మిల్ సిబ్బందితో మాట్లాడారు. మొలక ఎత్తలేదని బతిమాలారు. అయినా సిబ్బంది కనికరించలేదు. ధాన్యం బస్తాలు దించుకోమని మొండికేశారు. దీంతో రైతులు గురువారం లారీ పైకి ఎక్కారు. ధాన్యం బస్తాలను కిందికి దించారు. రైస్‌మిల్ సిబ్బందిని పిలిపించి ధాన్యం ఎక్కడ మొలకెత్తిందో చూపించాలని నిలదీశారు. సిబ్బంది (మిగతా 8లో..)



లారీలో నుంచి ధాన్యం బస్తాలు దించుతున్న రైతులు

2012 నియామకాలపై..
హైకోర్టు కొరడా





తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2012లో చేపట్టిన అక్రమ నియామకాలపై హైకోర్టు రద్దు ముద్ర వేసింది. టీయూలో జరిగిన ప్రొఫెసర్‌లు, అసోసియేట్ ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల పోస్టులను రద్దు చేస్తూ గత నెల 31న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ సంచలన తీర్పు ఇచ్చారు. 2012లో అప్పటి వైస్ చాన్స్‌లర్ అక్బర్‌అలీఖాన్ రోస్టర్ పాయింట్‌లు, రిజర్వేషన్ నియమాలను తుంగలో తొక్కుతూ అర్హతలేని వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో హైకోర్టులో 11 మంది అభ్యర్థులు ప్రజా ప్రయోజన వాజ్యాన్ని వేశారు. గతంలో నియామకం అయిన 91 మందిలో ప్రస్తుతం 54 మంది పని చేస్తుండగా వీరిని పర్మినెంట్ చేసేందుకు ప్రస్తుత వీసి, రిజిస్ట్రార్‌లు ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిగా అక్రమ నియామకాలను రద్దుచేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

- తెలంగాణ యూనివర్సిటీలో అక్రమ పోస్టుల రద్దు
- తీర్పు ఇచ్చిన హైకోర్టు ధర్మాసనం
- 13 ఏళ్ల క్రితం ఆగమేఘాలపై నియామకాలు
- తెల్లవారు జామునే ఉత్తర్వులు
- ఇష్టానుసారంగా రోస్టర్ పాయింట్ల మార్పు
- అప్పటి వైస్ చాన్స్‌లర్ కీలకపాత్రధారి

నిజామాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2012 ఏప్రిల్ 27న జరిగిన తెలంగాణ యూనివర్సిటీ పాలకవర్గ సమావేశంలో అప్లైడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్, కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ ఐదేళ్ల కోర్సును నిలిపివేశారు. కొత్త కోర్సులు ఎంఏ ఎకనామిక్స్, ఎంఎస్సీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ కోర్సులను ప్రవేశపెట్టారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రద్దయిన కోర్సులతో పాటు ఐదేళ్ల కోర్సులకు సంబంధించి ప్రొఫెసర్‌లు 13 మంది, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్‌లు, 48 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు మొత్తం 91 పోస్టులకు 3 వేర్వేరు నోటిఫికేషన్‌లు ఇచ్చారు.

రోస్టర్ పాయింట్లలో మాయ

రెండేళ్ల కోర్సులకు 1:2:4 రోస్టర్ పద్ధతిని అమలు చేయాల్సి ఉండగా రోస్టర్ పాయింట్లను మార్చి ఇతర సబ్జెక్టులలో రిజర్వేషన్‌లను ప్రభావితం చేసేలా 1:3:7 క్రమంలో రోస్టర్ పద్ధతిని అమలు చేశారు. నియామకాల్లో ఈ రోస్టర్ పాయింట్లను అమలు చేయడం వల్ల అనేకమంది నష్టపోయారు. ఇదే విషయాన్ని హైకోర్టు సైతం గుర్తించి అప్పటి నియామకాలను పూర్తిగా రద్దు చేసింది. కొత్త నోటిఫికేషన్‌లు ఇవ్వడంతో పాటు నియామకాలు చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

కోడి కూయక ముందే ఉత్తర్వులు

ఆగమేఘాలపై 2012లో నోటిఫికేషన్‌లు ఇచ్చి 2014 జనవరి 4వ తేదీన తెల్లవారుజామున అప్పటి రిజిస్ట్రార్, మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే నియామకాలు ఇవ్వడంతో పాటు అదే సమయంలో విధుల్లోకి చేర్చుకోవడం అప్పట్లో వివాదాస్పదమైంది. 2014 జనవరి 3న నియామకాలపై ఉన్న స్టేపై షరతులు విధిస్తూ కోర్టు సడలింపు ఇవ్వగా అదే అదనుగా జనవరి 4వ తేదీ తెల్లవారుజామున నియామకాలు చేయడంపై అనేక ఆరోపణలు వచ్చాయి. దీని వెనక పెద్దఎత్తున వసూళ్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

13 ఏళ్ల న్యాయ పోరాటం

అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అక్రమ నియామకాలపై విచారణ కోసం భాస్కర్‌రావు, ప్రసాద్‌రావులతో కూడిన ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జస్టిస్ సీవీ రాములు నేతృత్వంలో ఏకసభ్య కమిటీ కూడా ఏర్పాటైంది. అక్రమ నియామకాలు జరిగి దాదాపు 13 ఏళ్లు గడిచిన తర్వాత హైకోర్టు నియామకాలు చట్టవిరుద్ధమని నియామకాలను రద్దు చేసింది. అప్లైడ్ ఎకనామిక్స్‌ను జాబితాలో మొదటి స్థానంలో చూయించి హింది పోస్టును ఓసీకి ఇవ్వడం వాస్తవానికి ఆ పోస్టు ఎస్టీకి రావాల్సి ఉండగా రోస్టర్ పాయింట్లు మార్చడంతో ఎస్టీ అభ్యర్థికి అన్యాయం జరిగింది. బోటని డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ మరణించినప్పటికి ఖాళీ అయిన పోస్టును నోటిఫికేషన్‌లో చూయించలేదు. ఈ అంశం కూడా మొత్తం రోస్టర్ విధానాన్ని మార్చేసింది. నోటిఫికేషన్‌లు విడుదల చేసిన తర్వాత కోర్సులను తిరిగి ప్రవేశపెట్టడం అనేక మందికి అన్యాయం జరిగింది. 13 ఏళ్లపాటు అర్హులైన అభ్యర్థులు న్యాయపోరాటం చేయడంతో హైకోర్టు నియామకాలను రద్దుచేస్తూ తీర్పు ఇచ్చింది. 24 పేజీల్లో హైకోర్టు తీర్పు వెలువరించింది.

కీలకపాత్రధారి అప్పటి వీసీ..

2012లో యూజీసీ 2009 రెగ్యులేషన్స్, ఏపీ యూనివర్సిటీ యాక్ట్ 1991 నిబంధనల ఉల్లంఘనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్‌లు మార్చడంలో అప్పటి వైస్ చాన్స్‌లర్ అక్బర్ అలీఖాన్ కీలకపాత్రధారిగా ఉన్నారు. అర్హతలేని వారికి ఉద్యోగాలు ఇవ్వడం, అర్హులను తప్పించడం ఇలా అనేక విషయాల్లో అప్పటి వీసీ కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట 2013 ఫిబ్రవరి 25న నియామక ఉత్తర్వులు ఇచ్చి జనవరి 4, 2014న మళ్లీ ఆగమేఘాలపై నియామక ఆర్డర్‌లు, జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చింది. అక్రమ నియామకాల వ్యవహారంలో అప్పటి వీసీని దోషిగా తేలుస్తూ అప్పటి ద్విసభ్య కమిటీ పేర్కొంది. ఇప్పుడు హైకోర్టు తీర్పు సైతం తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన అక్రమ నియామకాలకు చెంపపెట్టుగా మారింది.



నాగిరెడ్డిపేట వద్ద మంజీరా వరద నీటిలో మునిగిన పంటలు (ఫైల్)

పరిహారం..
ప్రశ్నార్థకం!

- పంట నష్ట పరిహారం అందేదెప్పుడో?
- సీఎం పర్యటించి రెండు నెలలు గడిచినా అందని పరిహారం
- జిల్లాలో అత్యధికంగా నాగిరెడ్డిపేటలో 2,835 ఎకరాల్లో పంట నష్టం
- పంట నష్టంతో కోలుకోలేని స్థితిలో జిల్లా రైతులు

నాగిరెడ్డిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరగ్గా పంటలు నష్టపోయిన రైతులకు ఇంతవరకు ప్రభుత్వం నష్టపరిహారం అందించ లేదు. పంట నష్టం జరిగి రెండు నెలలు గడుస్తున్నా రైతులకు పరిహారం అందడం ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రెండు నెలలు గడిచాయి. ఇంతవరకు పంట నష్టపోయిన జిల్లా రైతులకు నయాపైసా ప్రభుత్వ పరిహారం అందలేదు. ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించి పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చి వెళ్లారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయలేదు. రైతులకు నష్ట పరిహారం అందించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పరిహారం కోసం నిత్యం జిల్లా రైతాంగం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోంది. నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఎప్పటికీ అందిస్తుందోనని, తమను ప్రభుత్వం ఎప్పుడు ఆదుకుంటుందోనని జిల్లా రైతులు రేవంత్‌రెడ్డి సర్కారుపై కోటి ఆశలు పెట్టుకొన్నారు. ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి కన్నెర్ర చేయడంతో అతివృష్టి వరదల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రైతుల బతుకులు అతలాకుతలమయ్యాయి. దీంతో జిల్లా రైతులకు కోలుకోలేని తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 24,809 మంది రైతులకు సంబంధించి సుమారు 24,473 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సర్వేలు జరిపి పంట నష్టం నివేదికలను ప్రభుత్వానికి అందజేశారు. అధికారులు జిల్లాలో జరిగిన పంట



(మిగతా 8లో..)



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు రూ.2కోట్ల 28లక్షలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రీన్ చానల్ ద్వారా ప్రతీనెల 5వ తేదీలోపు వంట బిల్లుల వేతనాలు చెల్లించాలని కార్మికులందరికీ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ, యూనిఫారం గుర్తింపు కార్డులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంటే వాటిని చెల్లించకుండా ఎమ్మెల్యే, హెడ్మాస్టర్‌లు, టీచర్లు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టమని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, సరస్వతి, ప్రమీల, పరశురాములు, దుర్గయ్య, సత్తయ్య, వాణి,స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రార్థన సమయంలో హాజరైన ఎమ్మెల్యే

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా చూడాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో తనిఖీ చేపట్టారు. చిన్నమల్లారెడ్డి పాఠశాలలో విద్యార్థులతో బోధన జరుగుతున్నతీరుపై ఆరా తీశారు. ఆయా పాఠశాలల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులతో మాట్లాడి పరిష్కా రం చూపుతామని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. ప్రతీ గర్భిణీకి, చిన్నారులకు తగిన పోషకాహారం అందేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉంటుందని తెలిపారు.

ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలి

- డీఆర్డీవో పీడీ సురేందర్

తాడ్వాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ కేవైసీ త్వరగా పూర్తి చేయాలని డీఆర్డీవో పీడీ సురేందర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ కేవైసీ చాలా తక్కువగా ఉందని బ్రాహ్మణపల్లి, పెద్దదేమి, కన్కల్, నందివాడ, తడువాయి గ్రామాల్లో మరీ తక్కువగా ఉందన్నారు. తక్కువగా ఉన్న ప్రాంతాల్లో క్షేత్ర సహాయకులతో ఫోన్లో మాట్లాడి ఈరోజు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. లేనిపక్షంలో తక్కువగా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్డీవో

అంతేకాకుండా జిల్లాలో సైతం అన్ని గ్రామాల్లో ఈ కేవైసీ వంద శాతం అయ్యేలా క్షేత్ర సహాయకులు, ఉపాధిహామీ సిబ్బంది చూడాలన్నారు. ఉదయం పూట, సాయంత్రం పూట ఇంటింటికీ వెళ్లి, లేదంటే ప్రధాన కూడళ్లలో కూలీలను జమచేసి ఈ కేవైసీని పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే జిల్లా కింద స్థానంలో ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకొని ఈకేవైసీని తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చనిపోయిన వారికి సంబంధించి పంచాయతీ కార్యదర్శితో ధ్రువీకరించుకొని వాటిని తీసివేయాలని సూచించారు. వంద శాతం మీకు ఈకేవైసీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవిత, ఏపీవో కృష్ణాగౌడ్, కంప్యూటర్ ఆపరేటర్లు రామకృష్ణ, రేఖరాణి తదితరులు పాల్గొన్నారు.

అధికార ప్రతినిధిగా తుడుం ప్రదీప్

భిక్కనూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన తుడుం ప్రదీప్‌ని ఆల్ ఇండియా భారత్ జోడో యాత్రకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్‌గా నియమిస్తూ ఆల్ ఇండియా జోడోయాత్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ సమి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రదీప్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఇంత మంచి పదవిని కట్టబెట్టిన ఆల్ ఇండియా జోడోయాత్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ సమి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆరబెట్టిన ధాన్యం పరిశీలన

బాన్సువాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లం క్లస్టర్ పరిధిలోని జక్కలదాని తండా గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని గురువారం ఏఈవో రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని 17 తేమ శాతం మించకుండా ధాన్యాన్ని ఆరబెట్టాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నర్సింలు, రైతులు పీర్యా నాయక్, హరి, రవి, తారాచంద్, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పోక్సో కేసులో
నిందితుడికి ఐదేళ్ల జైలు

కామారెడ్డి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి 5ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానాను గురువారం జిల్లా న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో 2022 సెప్టెంబరు 18న స్కూల్‌కు సెలవు ఉండడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై జల్దేవార్ శ్రీనివాస్ అనే వ్యక్తి అతని ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక భయపడి కేకల్ వేయడంతో సమీపంలో ఉన్న నానమ్మ వచ్చి తలుపులు గట్టిగా కొట్టింది. దీంతో శ్రీనివాస్ బాలికను జరిగిన విషయాన్ని ఎవరికైన చెబితే చంపేస్తానని బెదిరించి పారిపోయాడు. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయాన్ని చెప్పడంతో బిచ్కుంద పోలీసుస్టేషన్‌లో శ్రీనివాస్‌పై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ విధించినట్లు తెలిపారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవీపేట,నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం) సమీపంలో బుధవారం బైక్‌ను కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్సై తిరుపతి తెలిపారు. సిరికొండకు చెందిన మొగిలిపురం రవిగౌడ్ తమ బంధువుల ఇంటికి తన బావమరిది పిల్లలైన విహాన్, అయాన్‌లను బైక్‌పై ఎక్కించుకుని నవీపేట వచ్చాడన్నారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అబ్బాపూర్(ఎం) సమీపంలో బైక్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో రవిగౌడ్‌కు తీవ్ర గాయాలు కాగా.. పిల్లలకు స్వల్ప గాయలయ్యాయన్నారు. రవిగౌడ్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. బాధితుడు రవిగౌడ్ తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మల్కారెడ్డిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

స్కూల్ బస్సును ఢీ కొన్న లారీ

▸▸ త్రుటిలో తప్పిన ప్రమాదం

మాక్లూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సును లారీ ఢీకొన్న ఘటన మాక్లూర్ మండలంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిక్లి శివారులోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులను గురువారం పాఠశాల బస్సు కొత్తపల్లి విద్యార్థినులను తీసుకెళ్లగా.. గ్రామంలో బస్సును ఎడమవైపునకు ఆపారు. అతి నిర్లక్ష్యంగా లారీ నడుపుతున్న డ్రైవర్ వెనక నుంచి బస్సును ఢీ కొంది. దీంతో అందులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి నష్టం జరగకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు పెనుప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకు న్నారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌ను పట్టు పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

పిట్లం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్నాపూర్‌లో భూమా పోచయ్య అనే రైతు ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందిందని రైతు కుటుంబసభ్యులు తెలిపారు. రోజూ మాదిరిగా పొలం వద్ద మేత మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మరణించిందని, తనకు రూ.60వేల నష్టం వాటిల్లిందని రైతు బోరున విలపించారు.

వివిధ కేసుల్లో జైలు శిక్ష

సుభాష్‌నగర్, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో వీరంగం సృష్టించిన ముగ్గురు మహిళలకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘురాం తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో పురుషులను ఆకర్షించేలా ప్రవర్తిస్తుండగా.. వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిని 68 సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి ముందు హాజరుపర్చగా శిక్ష విధించగా.. గురువారం జైలుకు పంపామన్నారు.

ముప్కాల్: బాల్కొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరికి దొంగతనం కేసు రుజువు కావడంతో ఇద్దరికి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సరళ ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. మండలంలోని బోదెపల్లి శివారులోని వ్యవసాయ భూమిలో మోటర్, ఫీజుల వైర్లను దొంగతనం చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను గత ఇదే నెలలో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. వారికి ఏడాది ఏడాది జైలు శిక్ష, వస్తువులు కొన్న వ్యక్తికి రూ.1500 విధించినట్లు వివరించారు.

రూ.50 వేల నగదు చోరీ

సుభాష్‌నగర్, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): ఆటోలో ఎక్కిన మాజీ సర్పంచ్‌ను ఆటో డ్రైవర్ మాయమాటలు చెప్పి 50వేల నగదును దొంగిలించాడు. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈర్ల ఆశన్న గురువారం గ్రామస్థులతో కలిసి గుడి నిర్మాణ పనుల కోసం నగరానికి వచ్చారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో తన కూతురును చూడడానికి ఆటోలో ఎక్కాడు. ఆశన్నను మాటల్లో పెట్టి జేబులో నుంచి 50వేల నగదు కాజేశారు. ఆటో దిగి వెళ్తుండగా జేబులో చూస్తే నగదు లేకపోవడంతో ఆటో రిక్షాను అడ్డుకునే ప్రయత్నం చేయగా డ్రైవర్ ఆటోను ఆపకుండా పరారయ్యాడు. ఆశన్న 4వ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్కు వెళ్లి వస్తానని చెప్పి ఓ మహిళ అదృశ్యమైన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇస్లాంపుర కాలనీకి చెందిన హసీనాబేగం ఈ నెల 4న మధ్యాహ్నం 12గంటలకు పార్కుకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం పట్టణంలో, చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికినా లభ్యం కాలేదు. హసీనాబేగం భర్త సాహెబ్ అలీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బాన్సువాడ రూరల్, నవంబరు 06(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ శివారులో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి, గురువారం కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోధన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం బర్దీపూర్‌కు చెందిన చిన్న గంగారాం(50) జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. వివరాలు.. చిన్న గంగారాం 4వ తేదీన బోధన్‌లో పనులు ముగించుకుని తిరిగి బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో వడ్ల కుప్పను ఢీకొని పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. గంగారాం మరణానికి రోడ్లపై వేసిన వడ్ల కుప్ప కారణమని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

పేదల కల.. కలగానే..!

ఏర్గట్లలో డబుల్ బెడ్‌రూమ్‌ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు



▸▸ పంపిణీకి నోచుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ▸▸ ఏళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు

ఏర్గట్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మంచి ఇల్లు కట్టుకొని కుటుంబంతో అందులో హాయిగా జీవితం గడపాలనేది పేదల కల. కానీ కలలు అలాగే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం ఇళ్లు కట్టిస్తామన్న ప్రతిసారి అర్హుల ఆశలకు రెక్కలు వచ్చేవి. కానీ వాటిని కట్టినా.. పంపిణీ చేయకపోవడంతో ఆశలు ఆవిరవుతున్నాయి. ఇదే పరిస్థితి ఏర్గట్ల మండలకేంద్రంలోని బీఆర్ఎస్ హయాంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

2021లో కట్టినా.. పంపిణీ చేయలే..

మండలకేంద్రంలో బీఆర్ఎస్ హయాంలో 2021లో 48 డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్ల పాటు పనులు సాగి.. అసంపూర్తిగానే నిర్మాణాలు వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనుల్లో ఆలస్యం కావడంతో నిరుపేదలకు ఇళ్లపై ఆశ లేకుండాపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించడంతో అలాంటి వారు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దీంతో డబుల్ బెడ్ రూమ్‌ల కోసం అప్లై చేసుకున్నవారు నిరాశకు లోనవుతున్నారు.

నిరుపయోగంగా గృహాలు..

డబుల్ బెడ్ ఇళ్ల పంపిణీకి ముందే శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంది. ఇళ్ల సముదాయాల్లో పూర్తిగా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు మొలిచి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. గదుల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోగా రేకులు ఏర్పాటుచేయగా, కిటికీలు పూర్తిగా తుప్పు పట్టిపోయాయి. పలు చోట్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇళ్లు కాస్త మందుబాబుల అడ్డాలుగా మారిపోయాయి.

లబ్ధిదారులకు భారమే....

అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పిన అధికారులు కాలయాపన చేయడం తప్ప ఎంపిక మాత్రం చేయడం లేదు. ఒకవేళ వారికి అందజేసినా.. గదుల్లో వసతులు ఏర్పాటు చేసుకోవాలంటే భారంగానే మారనుంది. ఏదేమైనా నిరుపేదలను గుర్తించి ఇళ్ల పంపిణీ చచయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులను గుర్తించి, నివేదిక పంపిస్తాం



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో లబ్ధిదారులను గుర్తించి, దానికి సంబంధించిన నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తాం. వారి ఆదేశాల ప్రకారం ఇళ్లను పేదలను గుర్తించి, వారికే కేటాయించేలా పూర్తి పారదర్శకత పాటించి ఇళ్లు అందజేస్తాం.

- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, ఏర్గట్ల



ఆలూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఆలూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 65 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఇతర సంక్షేమ కార్యక్రమాల గురించి తహసీల్దార్, ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎమ్మార్వో రమేష్, ఆర్ఐ రేణుక, బీజేపీ నాయకులు సుభాష్, యాదగిరి, ఆలూర్ మండల బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి విరాళం ఇస్తున్న దాతలు

ఆలయ నిర్మాణానికి రూ.8.88లక్షల విరాళం

ఆర్మూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి రాంనగర్‌కు చెందిన రేవతి, భూమయ్య దంపతులు, వారి కుమారులు శ్రీతేజ్, రోహిత్ ముదిరాజ్‌లు రూ.8,88,888 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. దాతలను ఆలయ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మచ్చేందర్, ముదిరాజ్ సంఘం పెద్దబజార్ అధ్యక్షుడు సంతోష్, సభ్యులు పోశెట్టి, మోహన్, బాలనంద్, గోపి, భోజన్న, రమేష్, బాలు, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్

జక్రాన్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, ఇతర తమకిష్టమైన రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సూచించారు. మండలంలోని మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా స్పోర్ట్స్ మీట్ నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పది గురుకుల పాఠశాలల విద్యార్థినులు హాజరయ్యారు. మహిళలకు అనేక అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరుచూరి అనూష, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

తిరస్కరించిన జాబితాను సమర్పించాలి

బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

సాలూర,నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరస్కరించిన సాదాబైనామాలకు సంబంధించిన జాబితాను తక్షణమే సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం సాలూర తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు జరిగినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందించడంలో విధేయతగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శశిభూషణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

వేల్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ యాజమాన్యంపై చట్టరీత్య చర్య తీసుకొని బీడీ కార్మికులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నేత అరవింద్ డిమాండ్ చేశారు. గురువారం పచ్చలనడ్కుడ జాన్కంపేట్ గ్రామాల్లో కార్మికులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను గురవారం ఆవిష్కరించారు. కంపెనీ యాజమాన్యం వెయ్యి బీడీలకు 600 గ్రాములు ఆకు వేయడం వల్ల ఆకులో తరుగు ఏర్పడి 600 బీడీలు మాత్రమే అవుతున్నాయని, మిగితా 400 బీడీలకు ఆకు సరిపోక తనకు వస్తున్న బట్వాడ నుంచి తుట్టి నింపుతోందని ఆరోపిచారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నజీర్, లసుంబాయి, లక్ష్మీ, సంధ్య, గంగమణి, హర్ష, సంధ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ముప్కాల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఐ గంగారాం తెలిపారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు జరిగే విధానాన్ని గ్రామస్థులకు వివరించారు. వ్యాపారం, పెట్టుబడి, క్రెడిట్ కార్డుపై రుణాలు, నకిలీ రుణయాప్‌లు, ఆన్‌లైన్ డెలివరీ, డిజిటల్ ప్రపంచంలో స్వీయ రక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. రుణ గ్రహీతలను లక్ష్యంగా చేసుకొని ఇంటర్ నెట్‌లో మోసాలు చేస్తున్నారని అన్నారు. సులభమైన రుణఆమోదం పేరుతో వ్యక్తులకు రుణాల పేరుతో ప్రలోభ పెట్టి వ్యక్తిగత సమాచారం ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి వివరాలు అడగడంతో పాటు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇలాంటి మోసగాళ్ల ఉచ్చులో పడవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముప్కాల్ పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆర్మూర్ టౌన్, నవంబరు6 ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను గురువారం పుర కమిషనర్ రాజు పరిశీలించారు. పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్, 31వ వార్డులో జరుగుతున్న బీటీ కల్వర్టు పనులను పరిశీలించారు. అలాగే పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లకు డ్రైనేజీ సదుపాయం కల్పించేందుకు, పెర్కిట్, మామిడిపల్లిలో పబ్లిక్ టాయిలెట్‌ల నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించి, పెర్కిట్ జంక్షన్ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను ఆయన తనిఖీ చేశారు. అభివృ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది రాహుల్, చందు పాల్గొన్నారు.



పట్టణంలో పర్యటించిన మునిసిపల్ కమిషనర్

టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

మోస్రా,నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు కుటుంబ కలహాలతో టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని సముదాయించి కిందకి దింపారు. దీంతో యువకుడి కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కుటుంబికులను వర్ని పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి గొడవలు పడొద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు.

టవర్‌పైకి ఎక్కి కూర్చున్న యువకుడి దృశ్యం →



రాష్ట్రవ్యాప్త పోరాటం చేస్తాం

పెర్కిట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన వారికే కేటాయించాలని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని మానవహారం ఏర్పాటుచేసి నిరసన తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు ప్రభాకర్, దేవరాం మాట్లాడుతూ.. పేదలకు, అర్హులైన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని అన్నారు. నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్నా కూడా అధికారులు, ప్రజా ప్రతినిధులు మౌనంగా ఉండడం విడ్డురంగా ఉందని అన్నారు. తాత్కాలికంగా విరమించిన రిలే నిరాహార దీక్షను రేపటి నుంచి కలెక్టర్ కార్యాలయం, ప్రజా ప్రతినిధుల కార్యాలయం వద్ద కొనసాగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేసి ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి. కిషన్, సత్తెక్క, ఠాగూర్, మచ్చర్ల రాజన్న, ఆకుల గంగన్న, పీడీఎస్‌యూ నరేందర్, అంకాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పెర్కిట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం యాత్రకు సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేయనున్నట్లు డిపో మేనేజర్ పి. రవికుమార్ తెలిపారు. నవంబర్ 15న మధ్యాహ్నం 3 గంటలకు ఆర్మూర్ డిపో నుంచి బయలుదేరి అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అలంపూర్ జోగులాంబ, అమ్మవారి శక్తి పీఠం దర్శించుకుని తిరిగి ఆర్మూర్ చేరుకుంటుందని అన్నారు. ఇందుకు గాను రూ.5,100 చార్జీ ఉంటుందని, టికెట్ ముందస్తుగా తీసుకోవాలని అనుకున్న వారు బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

నవీపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతలు పెద్ద పోచమ్మ, భూలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మారెడమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన గురువారం గణపతిపూజ, పుణ్యవచనం, గోపూజ, అఖండ దీపారాధన, మంటప పూజ, హోమం, జలాధివాసం, మంత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలలో చివరి రోజైన శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.

సుదర్శన్ రెడ్డిని కలిసిన నీలా గ్రామస్థులు

రెంజల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో గురువారం నీలా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలోని పలు సమస్యల పరిష్కారం గురించి వివరించడం జరిగిందని, గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కందకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షులు గంగన్న, సాయన్న, గంగారాం, రాఘవేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, మాదారి, అలీమొద్దీన్, ముజ్జు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాక్లూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు చేయించుకోవాలని, ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో మండల పశువైద్యాధికారి ఉమామా సాహేబ్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గాలికుంటు నివారణ టీకాలు సంవత్సరానికి రెండు సార్లు అందిస్తామన్నారు. ఈ వ్యాధి వస్తే పశువులు అతి జ్వరంతో నీరసించి నోరు, కాళ్లు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి నడవలేక ఇబ్బంది పడుతాయన్నారు. దీంతో పునరుత్పత్తి తగ్గి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పశువైద్య సిబ్బంది వినీత, కళ్యాణి, హైమద్, తదితరలు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా పశువైద్యాధికారి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆర్మూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిప్రి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎమ్ నవీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగారెడ్డి తెలిపారు. ఈ నెల 7 నుంచి పెద్దపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని రేండ్ల రవీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి గురువారం తెలిపారు. ముప్కాల్‌లో నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఉపాధ్యాయులు మునీరొద్దీన్, ప్రవీణ్ శర్మ, విజయ్, రాజేందర్, రిషిక, కృష్ణవేణి, పాల్గొన్నారు.

ఆలూర్: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేందర్, పీడీ రాజేష్ తెలిపారు. ముప్కాల్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లాస్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థులు ఎం.వాస్తవ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వాస్తవ్ పాల్గొంటారని తెలిపారు. మిర్ధాపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని శిరీష రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎమ్ నరేందర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయిని సుజాత తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి పెద్దపల్లిలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మోర్తాడ్: మండలస్థాయిలో 6-10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో పాలెం జడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థినులు గెలుపొందారు. వ్యాసరచనలో జైనబ్ పాతిమా 1వ, ఉపన్యాస పోటీల్లో అఫ్షబేగం 3వ బహుమతి గెలుచుకున్నారు. హెచ్‌ఎమ్ వేణుగోపాల్ రావు వారిని అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని రవీనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఆలూర్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తున్న హెచ్‌ఎం నవీన్

చదువుతో పాటు క్రీడలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద రావు

రెంజల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. గురువారం రెంజల్ ప్రభుత్వ పాఠశాలలో సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని మండల స్థాయి టాలెంట్ టెస్ట్, సైన్స్ క్రీడాపోటీలు, రంగోళి, లలిత సంగీత పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పిల్లల్లో ఉన్న సైన్స్ టెక్నాలజీని అభివృద్ధి చెందేందుకు కృషిచేయడానికి విశ్రాంత ఉపాధ్యాయులు విజయానంద రావు ఏటా మండలస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో అన్నారు. పీఆర్‌టీయూ అధ్యక్షుడు సోమలింగం గౌడ్, జడ్పీ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అరుణ్, పీఆర్‌టీయూ మాజీ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, కృష్ణ, గంగాధర్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వేల్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన అశోక్ కుటుంబానికి మండల దుర్గ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. గురువారం ఆటో యూనియన్ సభ్యులు కలిసి మృతుడు అశోక్ ఇంటికెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం రూ. 19 వేలు మృతుని భార్యకు అందజేశారు.

మేత కోసం వలస



మేత కోసం సంగారెడ్డి జిల్లా నుంచి వలస వస్తున్న జీవులు

పెద్ద కొడప్‌గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆకలి ఎటువంటి వారినైనా ఎంత దూరమైనా నడిపిస్తుంది. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ప్రస్తుతం గొర్రెలను మేతతక్కువ కావడంతో ఆ ప్రాంతంలోని వివిధ గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు వాటిని తీసుకుని జుక్కల్ నియోజకవర్గంలోని మంజీరా పరివాహక ప్రాంతాలకు తరలి వస్తారు. ప్రస్తుతం కంగ్టి ప్రాంతంలో సోయాపంట, పత్తి పంటలు చేతికి రావడంతో అక్కడ జీవాలకు మేత తక్కువ దొరుకుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో ప్రస్తుతం వరిపంట చేతికి రావడంతో తిరిగి పంటను సాగుచేయడానికి మరో రెండునెలల పాటు సమయం ఉండడంతో ఆ ప్రాంతానికి చెందిన గొర్రెల కాపరులు తమ జీవాలను తీసుకుని మంజీరా ప్రాంతానికి వలస వస్తుంటారు. రెండునెలల పాటు ఈ ప్రాంతంలో ఉండి స్వగ్రామాలకు వెళుతామని, అనంతరం రబీ సీజన్‌లో వరి కోతలు పూర్తికాగానే తిరిగి ఇక్కడికి వస్తామని తెలిపారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



దివ్యాంగ చిన్నారులకు చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భవిత భవన్‌లో గురువారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యుడు గంగాధర్ చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు దివ్యాంగ చిన్నారులకు ఉదయం, సాయంత్రం వేళలో వ్యాయామం చేయించాలని సూచించారు.

సంచుల పంపిణీ



లబ్ధిదారులకు చేతిసంచులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో రేషన్ కార్డుదారులకు చేతిసంచులు పంపిణీ చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో గల లబ్ధిదారులకు సరుకులు తీసుకెళ్లేందుకు గాను సంచులు సరఫరా చేసింది. దీంతో ఈ నెల రేషన్ బియ్యంతో పాటు లబ్ధిదారులకు ఆయా గ్రామాలలో చేతి సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారని, దీంతో ప్రజలు ఆ బియ్యాన్ని తినలేక అమ్ముకున్నారని తెలిపారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం గుర్తుచేశారు. అంతేకాక గత 10 సంవత్సరాల కాలంలో రేషన్‌కార్డులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని తెలిపారు. రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరంగా సాగడం ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్ అశోక్, నాయకులు మోహీద్దీన్, మొగులాగౌడ్, పర్వయ్య, కిషన్, గంగాగౌడ్, రమేష్ దేశాయ్, రాంచందర్, జే.తినాయక్, షపీ, బార్యనాయక్ తదితరులు పాల్గొన్నారు

చోరీల నివారణకు చర్యలు చేపట్టాలి

● రూరల్ సీఐ తిరుపతయ్య



పోలీసు సిబ్బందితో సీఐ తిరుపతయ్య, ఎస్ఐ రాఘవేంద్ర

నసురుల్లాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చోరీల నివారణకు చర్యలు చేపట్టాలని బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుసిబ్బందితో ఆయన మాట్లాడుతూ. మండలంలోని ఆయా గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు.. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

● డోంగ్లి వైద్యురాలు శ్రీలేఖ



పట్టాను పరిశీలిస్తున్న వైద్యురాలు

మద్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎంపీ వైద్యులు స్థాయికి మించిన వైద్యం చేస్తే చర్యలు తప్పవని డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో ఆర్ఎంపీ, పీఎంపీ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆర్.ఎం.పీ, పీ.ఎం.పీ ఆసుపత్రుల ను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రథమ చికిత్స చేయవలసిన ఆర్ఎంపీ, పీఎంపీలు ఇంజక్షన్లు పెట్టరాదని, యాంటీబయోటిక్స్, షుగర్, బీపీకి సంబంధించిన మందులు ఇవ్వరాదని సూచించారు. మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ ఆసుపత్రులను తనిఖీ చేసి వారికి సం బంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

- రికవరీ చేయిస్తామన్న ఏపీ
- జుక్కల్‌లో ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ

జుక్కల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో నిధులు దుర్వినియోగం చేసిన ఉపాధి సిబ్బందిని గుర్తించి నిధులు రికవరీ చేయిస్తామని ఉపాధిహామీ ఏపీ డి.వామన్‌రావు పేర్కొన్నారు. గురువారం జుక్కల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని సోషల్‌ఆడిట్ వివరాలు పరిశీలించారు. నాలుగు రోజుల నుంచి ఉపాధిహామీ తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనులు జరిగిన వివరాలపై విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం అయినట్లు గ్రామసభలో గుర్తించి ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రికార్డులు పరిశీలించిన ఉన్నతాధికారులు కొన్ని గ్రామాలలో కూలీలకు బదులుగా బినామీ పేర్లు నమోదు చేసి డబ్బులు డ్రాచేసినట్లు తనిఖీ బృందం బయటపెట్టింది. జుక్కల్ మండలం సోఫూర్ మధుర తండా పడంపల్లి వివిధ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్‌అసిస్టెంట్ తనిఖీ బృందానికి క్యాష్‌బుక్ ఇవ్వకపోవడంతో తనిఖీ బృందం పలు అనుమానాలు లేవనెత్తింది. మెజర్‌మెంట్ ప్రకారం కాకుండా అదనంగా డబ్బులు చెల్లించినట్లు తనిఖీ బృందం గుర్తించింది. పని చేసిన కూలీలు బదులు ఇతర వ్యక్తులు వేలిముద్రలు వేసినట్లు ప్రజా వేదికలో బయటపడింది. సోషల్‌ఆడిట్ ద్వారా అవినీతికి పాల్పడిన టీఏ ఫీల్డ్ అసిస్టెంట్ ఏపీవోలను గుర్తిం చి నిధుల రికవరీ ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు.

పరీక్షలు వాయిదా వేయాలి

- ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం వినతి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఇందల్వాయి, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరికి ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సభ్యులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసే విధంగా సహకరించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రైవేట్‌డిగ్రీ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో తాము చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తమకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వస్తేనే కళాశాల నడిపే పరిస్థితి ఉన్నందున నాలుగురోజుల నుంచి కళాశాలలను బంద్ చేసి నిరవధికంగా బంద్ చేసి తమ నిరసన తెలుపుతున్నామన్నారు. ఒక వైపు కళాశాలలు బంద్ ఉండడంతో విద్యార్థులు పరీక్షా ఫీజులు కూడా కట్టడానికి రాలేకపోయారని, ఇంకా దాదాపు 40 శాతం మంది విద్యార్థులు పరీక్షా ఫీజు చెల్లించాల్సి ఉందని వాపోయారు. కళాశాలల బంద్ పూర్తయ్యే వరకు పరీక్షల సమయ సారిణిని విడుదల చేయొద్దని అదేవిధంగా పరీక్షా ఫీజు చెల్లించే చివరి తేదీని కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రాకపోవడంతో తమ కళాశాలలు కోలుకోలేని విధంగా మారిపోయాయని, ఇప్పుడు కళాశాలలు తెరిచినా గాని సిబ్బంది పనిచేయడానికి రావడానికి సుముఖంగా లేరని జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి తమను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద కళాశాల యాజమాన్యాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల యాజమాన్య అధ్యక్ష కార్యదర్శులు జైపాల్ రెడ్డి నరాల సుధాకర్ తో పాటు మారయ్య గౌడ్ శంకర్ శ్రీనివాసరాజు గురువేందర్ రెడ్డి అరుణ్ గిరి రమణ సత్యం దత్తు విజయ్ గంగాధర్ చందన్ గంగారెడ్డి రషీద్ షకీల్ వెంకట కిషన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఇందల్వాయి, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇందల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.కుసుమ (పదో తరగతి) ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి రాజేశ్వర్‌లు గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 7 నుంచి 9 వరకు ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరుగుతున్నాయని ఆ పోటీలలో కుసుమ నిజామబాద్ జిల్లా జట్టు తరపున పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన కుసుమను వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేడు విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార వేదిక

జక్రాన్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రూరల్ సబ్ డివిజన్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బాలేష్ కుమార్ తెలిపారు. పడకల్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూరల్ సబ్‌డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రూరల్, మోపాల్, జక్రాన్‌పల్లి మండలాలతో పాటు బర్ధిపూర్ సెక్షన్ పరిధిలోని వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆత్మకూర్‌లో బాధితురాలికి చెక్కును అందజేస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో 9 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు గురువారం పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి దివిటి కిష్టయ్య తెలిపారు. మండలంలోని ఏడుగ్రామాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రెండు లక్షల 64 వేల 500 రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఆత్మకూర్ మాజీసర్పంచ్ బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటు

- డీఆర్‌డీవో సురేందర్



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

నాగిరెడ్డిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలో జాతీయ రహదారి పక్కన మండల సమైక్య ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) సురేందర్ తెలిపారు. మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలోని సర్వేనెంబర్ 834లో పదిఎకరాల భూమిని గతంలో అధికారులకు ఐకేపీకి కేటాయించారు. ప్రస్తుతం అట్టి భూమిలోంచి 9 ఎకరాల భూమిని గిడ్డంగుల ఏర్పాటు కోసం రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు కేటాయించినట్లు, మిగత ఎకరం భూమిని మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ కోసం కేటాయించినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని తహసీల్దార్ శ్రీనివాస్ రావుతో కలిసి డీఆర్‌డీవో సురేందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్ర సమీపంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు 50 లక్షల వ్యయంతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అలాగే జిల్లాలో ఇప్పటి వరకు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 1769 మంది రైతుల ఖాతాల్లో 23.52 కోట్ల రూపాయలు జమ అయినట్టు అయిన తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల నుంచి వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులు ఎలాంటి దిగులు చెందొద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రావు, డీపీఎం సురేష్ కుమార్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రవీందర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోర్తాడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం పౌరహక్కుల సంఘం మూడో రాష్ట్ర మహాసభల పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. మోర్తాడ్‌లో పోస్టర్ల ఆవిష్కరణ అనంతరం పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి, న్యాయవాది ఆల్గోట్ రవీందర్ మాట్లాడుతూ 8,9వ తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో పౌరహక్కుల సంఘం మహాసభలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జలందర్, బి.నారాయణ పాల్గొన్నారు.

బోధన్ : పౌర హక్కుల సంఘం 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గురువారం బోధన్‌లో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు వి.సంగం న్యాయవాది కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరపత్రాలను ఆవిష్కరించామన్నారు. హక్కుల ఉద్యమంలో పోరాడుతూ ఎంతోమంది నేతలు ప్రాణాలను అర్పించారన్నారు. పౌర హక్కుల రాష్ట్ర మహసభలలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమ్‌గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ లింబాద్రి గుట్టపై విలేకరులపై దురుసుగా ప్రవర్తించిన ఆలయ అర్చకులపై చర్యలు తీసుకోవాలని మండల విలేకరుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లింబాద్రి గుట్ట జాతర ఉత్స వాల వార్తా కవరేజ్‌కి వెళ్ళిన విలేకరులను పరుషపదజాలంతో అవమానపరచారని, అలాగే జాతరకు విధులు నిర్వహించేందుకు వచ్చిన అధికారులు, భక్తులను కూడా అవమానపరిచారన్నారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సై సందీప్‌ను కోరారు.

వాటర్ ట్యాంక్‌ల ధ్వంసం



కొడిచర్ల మంజీరనదిలో పడేసిన వాటర్‌ట్యాంక్‌లు

కోటగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పబ్లిక్ మినీట్యాంక్‌లను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కాలనీల మధ్యలో గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉండి నీటి సరఫరా లేకపోవడంతో జేసీబీల సాయంతో ట్యాంకులను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన ట్యాంకులను మంజీర నది సమీపంలో పడేశారు. అనుమతి లేకుండా ట్యాంకులను తొలగించడంపై గ్రామంలో పలువురు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మంజీరనది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు అనుగుణంగా కల్వర్టు ఏర్పాటు నిమిత్తమై తరలించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌కు సమాచారం అందించారు. అనుమతి లేకుండా ట్యాంకులను తొలగించడంపై పంచాయతీ కార్యదర్శి పొతంగల్ ఎంపీడీవోకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎంపీడీవో చందర్‌ను వివరణ కోరగా ట్యాంకులను తొలగించిన విషయమై తమకు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. శుక్రవారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయండి

- రూరల్ ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం సిగ్గుచేటు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ ధ్వజం



మట్టిని పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన దినేష్

ఇందల్వాయి, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి) : రోడ్డుతెగిపోయి రెండు నెలలు గడుస్తున్నా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, ఇదే రోడ్డు వెంబడి వెళుతున్నా రోడ్డు కనిపించడం లేదా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ మండిపడ్డారు. రూరల్ ఎమ్మెల్యే ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందలవాయి మండలంలోని పాటి తండా వద్ద ఆగస్టు 28న కురిసిన అకాల వర్షానికి ఇందల్వాయి పెద్దచెరువు గండి తెగి గన్నారం రహదారిపై పెద్ద బుంగపడడం, ఇందల్వాయి నుంచి భీమ్‌గల్ వెళ్లే బీటీ రోడ్డు పాటి తండా వద్ద మొత్తం కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డు తెగిపోయి రెండునెలలు గడిచినా, అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గాని, ఏమి చేయలేకపోవడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి గురువారం జేసీబీ సహాయంతో మొరం పోసి రోడ్డుపక్కల చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు బాగాలేక ఎన్నో ప్రాణాలు బలి తీసుకుంటున్న సందర్భాలు ప్రతిరోజూ చూస్తూనే ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారులన్నీ తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన ఈ సందర్భంలో డిమాండ్ చేశారు, రూరల్‌లో ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నేతలు నాయుడి రాజన్న, వాసు, జగత్ సింగ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత వైద్య శిబిరం



బీర్కూర్‌లో రోగిని పరీక్షిస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 55 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏడుగురికి షుగర్ ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం వారిని బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రమేష్, కొట్టూరి సంతోష్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నెమలి సాయిబాబా ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నస్రుల్లాబాద్ మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమలి సాయి ఆలయం మినీ షిరిడీగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడ్వాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని కృష్ణాజివాడి, తాడ్వాయి, ఎర్రాపాడ్, బ్రాహ్మణపల్లి, దేవాయిపల్లి, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో చెక్కులు అందించామన్నారు. చెక్కులు త్వరగా వచ్చేందుకు కృషిచేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌రావు, వెంకట్ రెడ్డి, మేకల రాజు, లక్ష్మణ చారి, గైని లింగం, ఏనుగు మోహన్ రెడ్డి, లక్ష్మి, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న టీఎస్ఎస్ఎఫ్ నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యులు రవీందర్, బాలు అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదలని కోరుతూ నిరసన తెలిపారు. అనంతరం ఏవో అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనుసరించిన విద్యారంగ వ్యతిరేక విధానాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను కళాశాలల నుంచి పొందలేకపోతున్నారని అన్నారు. వేలాది మంది అధ్యాపకులు వివిధ కళాశాలల్లో పని చేస్తున్నారని వారికి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే ఫీజుబకాయిలు చెల్లించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ బాధ్యుడు మోతె రాజిరెడ్డి, రాష్ట్రనాయకులు చౌట గణేష్, తోట మనోహర్ పటేల్, జహీరాబాద్ పార్లమెంట్ బాధ్యులు అంజల్‌రెడ్డి, సతీష్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సదాశివనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సదాశివనగర్ మండలం పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గవాయ్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 17న ఢిల్లీకి తెలంగాణలోని అన్ని జిల్లాల ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లాకు వెయ్యి మంది చొప్పున బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కత్తి పద్మారావు, జిల్లా మాజీ కార్యదర్శి కొత్తోల్ల యాదగిరి, జిల్లా నాయకులు పెద్దపురి గంగన్న, కొక్కొండ దాకయ్య, బొంపల్లి భూమేష్, పెద్దపురి విఠల్, పరువయ్య, చిన్నలింగం, ప్రభాకర్, శ్రీను, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ చైర్‌పర్సన్



మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంత్రి మండలిలో చోటు దక్కించుకున్న మాజీ క్రికెటర్, మంత్రి అజారుద్దీన్‌ను కామారెడ్డి మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చేస్తుందని తెలిపారు. అజారుద్దీన్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించి సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీలకు ప్రాధాన్యమివ్వడం సంతోషకరమని తెలిపారు.

రాష్ట్రస్థాయికి పాల్వంచ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన యూత్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్‌లో హెల్మెట్ విత్ వైపర్స్ అనే అంశంలో ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ ప్రదర్శనలో లక్షిత్, సాయిక్రిష్ణ పాల్గొనగా వీరికి గైడ్ టీచర్‌గా స్వర్ణలత వ్యవహరించారు. విద్యార్థులను డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి, పాఠశాల హెచ్ఎం గోవర్దన్ రెడ్డి అభినందించారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలంటూ కళ్లకు గంతలు కట్టుకొని ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.10,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదలచేయాలని అన్నారు. గత నాలుగు రోజులుగా తెలంగాణలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఉన్నత విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తమకు తాముగా బంద్ చేసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నియంత వైఖరిని అవలంబించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డికి ఎమ్మెల్యే సన్మానం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తన కార్యాలయంలో సుదర్శన్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమించడం అభినందనీయన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మాచారెడ్డి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండల బీఆర్ఎస్ నూతన మండల అధ్యక్షుడిగా పగడాల బాల్‌చంద్రంను గురువారం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. సోమార్‌పేట గ్రామశాఖ అధ్యక్షుడిగా సంగం శంకర్, మర్రితాండా గ్రామశాఖ అధ్యక్షుడిగా బానోత్ రూప్‌సింగ్, సోమార్‌పేట్ యూత్ అధ్యక్షుడిగా సంతోష్‌నాయక్, ప్రధా కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షుడిగా దేవయ్యను ఎన్నుకున్నారు.

పరిహారం.. ప్రశ్నార్థకం!

(5వ పేజీ తరువాయి)

నష్టం నివేదికను ప్రభుత్వానికి అందించారు. అయినా ఇంత వరకు పంటలు నష్టపోయిన రైతులకు ఎలాంటి పరిహారం మంజూరు కాలేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగిరెడ్డిపేటలో అత్యధిక పంట నష్టం

భారీవర్షాల కారణంగా జిల్లాలో అత్యధికంగా నాగిరెడ్డిపేట మండలంలో పంట నష్టం జరిగింది. నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌తో మంజీరా నది ఉధృతంగా ఉప్పొంగి ప్రవహించడంతో మంజీరా వరద నీరు సుమారు 2 కి.మీ వ్యాపించడంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని శివారులో గల వరి పంటలు సుమారు 40 రోజుల వరకు నీటమునిగాయి. నాగిరెడ్డిపేట మండలంలో 2683 మంది రైతులకు సంబంధించి 2835 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సర్వేలు జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మండలంలోని మాల్తుమ్మెద, గోలిలింగాల్, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, బంజారా, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసానిపల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో మంజీరా వరద నీటిలో వరి పంటలు నీట మునిగాయి. గత 50 ఏళ్లగా ఎన్నడూ లేనంతగా మంజీరా నది ఈ సారి ఉప్పొంగి ప్రవహించిందని, దీంతో మండలంలో 40 రోజులకు పైగా వరి పంటలు నీట మునగడంతో తీవ్ర పంటనష్టం వాటిల్లిందని ఆరోపిస్తు న్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వేడు కుంటున్నారు.

సీఎం పర్యటించి రెండు నెలలు గడిచింది..

భారీ వర్షాలతో జిల్లాలో తీవ్ర నష్టం జరగడంతో వరద పరిస్థితులను తెలుసుకునేందుకు స్వయంగా సీఎం ఆగస్టు 28న హెలికాప్టర్‌లో జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డిలోని వరద ప్రభావిత ప్రాంతాలతో పాటు పోచారం ప్రాజెక్టు వరద ఉధృత పరిస్థితులను పరిశీలించారు. గత సెప్టెంబరు 4న సీఎం స్వయంగా జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. కామారెడ్డితో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. సీఎం జిల్లాలో పర్యటించి 2 నెలలు గడిచినా ఇప్పటికీ తమకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయలేదని జిల్లా రైతులు వాపోతున్నారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటించి వెళ్లినా...

పంటనష్టాన్ని అంచనా వేసేందుకు గత నెల అక్టోబరు 8న కేంద్ర బృందం జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో పర్యటించింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ధ్వంసమైన రోడ్లు, బ్రిడ్జిలు, తెగిపోయిన చెరువుల కట్టలు, వరదలతో నష్టపోయిన పంటలను, పోచారం ప్రాజెక్టును తదితర వాటిని కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు. జిల్లాలో జరిగిన నష్టం గురించి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. జిల్లాలో కేంద్ర బృందం పర్యటించినా తమకు ఎలాంటి ప్రభుత్వ సహాయం, నష్ట పరిహారం అందలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

కామారెడ్డిలో బీసీల మౌనదీక్ష



జిల్లాకేంద్రంలో మౌనదీక్షలో పాల్గొన్న బీసీ సంఘ సభ్యులు

కామారెడ్డిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మునిసిపల్ ఆవరణలో గురువారం మహాత్మాజ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాల వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, చట్టబద్ధంగా 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీల హక్కులను నెరవేర్చాలని అన్నారు. తమిళనాడు తరహాలో 50 శాతం సీలింగ్ ఎత్తేసి బీసీలకు జనాభా దామాషా ప్రతిపాదికన రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. బీసీ ఉద్యమాన్ని గల్లీ నుంచి క్షేత్రస్థాయిలో 'మేమెంతో మాకంత' అనే నినాదంతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్వరలో బీసీల చైతన్య యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, పండ్ల రాజు, కన్నయ్య, రాజేశ్వర్, గుడుగుల శ్రీనివాస్, మల్లన్న, రాజేందర్, ఇర్ఫాన్, లలిత, మంజుల, రాజయ్య, రాజీవ్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీకమాస కాకడ హారతి



బుడ్మిలో కాకడహారతిని వెలిగిస్తున్న వార్కారీలు

బాన్సువాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బుడిమి గ్రామంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కాకడ హారతి ముగింపు కార్యక్రమాన్ని వార్కారీలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటుగా హనుమాన్ ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వార్కారీలు, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్యురాలు మస్రత్ మాట్లాడుతూ.. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, నీరు ఎక్కువగా తాగి, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి అనారోగ్యాలు రావన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకట రమణ, ఏఎన్ఎం కవిత, ఉపాధ్యాయులు నర్సింహ చారి, తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

ఎంపీని కలిసిన అంబేద్కర్ సంఘ సభ్యులు

బాన్సువాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం బోర్లాం గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ శ్రావణి కుమారుడు నిశాంత్‌రెడ్డి సీఎస్సీ కోర్సులో ప్రథమ స్థానం సాధించగా ఎంపీ చేతుల మీదుగా సంఘ ప్రతినిధులు ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి సాయిలు, పోతరాజు లింగం, పట్లోళ్ల దేవేందర్‌రెడ్డి, గంగారాం, సాయిలు, విజయ్‌కుమార్, మన్నె గంగారాం, సయ్యద్ మంజూర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

సదాశివనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ రావు దశదినకర్మకు గాంధారి మాజీ జడ్పీటీసీ హరాలే తానాజీరావు, మాజీ ఎంపీపీ శివాజీ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్‌రావును పరామర్శించారు. మాజీ ఎంపీపీ బలరాం నాయక్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కామారెడ్డిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి గురువారం కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహ సమయంలో తల్లిదండ్రులకు ఆర్థికభారం కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.1.16 లక్షలను అందిస్తుందని తెలిపారు. తహసీల్దార్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి గురువారం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో బాలకృష్ణ, మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. తహసీల్దార్ హిమబిందు, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బాల్‌రాజు, ప్రవీణ్, అనీల్, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలకేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని 34 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను గురువారం మండల కేంద్రంలోని రైతులవేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు తిరుమలేష్, రంజిత్, అరిగె నర్సింలు, లబ్ధిదారులు, నాయకులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీసాన్‌పల్లి గ్రామంలో గురువారం ఎంపీడీవో తాహెరా బేగం పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ విడతల వారీగా అందిస్తామన్నారు. ఎంపీవో ప్రకాష్, కార్యదర్శి రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలోని బోర్లంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపీడీ వో ఆనంద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, సూపరింటెండెంట్ ముజాహిద్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని లింగుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించి ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం గ్రామంలో లబ్ధిదారులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన ప్రజలకు ఇళ్లు మంజూరు చేసిందని, లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, స్వామి, నర్సింలు, సాయిరెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.

ఆరు రోజుల పాటు ధాన్యం లారీ నిలిపివేత

(5వ పేజీ తరువాయి)

తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేనిపోని తప్పుడు కథలు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. రైస్‌మిల్ సిబ్బందితో రైతులు గొడవకు దిగారు. ధాన్యం బాగుంటే ఎందుకు అబద్ధాలు చెబుతున్నారని నిలదీశారు.

మాజీ సర్పంచ్, ఎంపీటీసీల జోక్యంతో సమస్య పరిష్కారం

బీర్కూర్‌లో రైస్‌మిల్ యజమాని, సిబ్బంది ఉద్దేశ్య పూర్వకంగా ధాన్యం బస్తాలు దించుకోవడం లేదని బాధిత రైతులు నసురుల్లాబాద్ మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌లకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే నసురుల్లాబాద్ నుంచి మాజీ సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు పెద్ద ఎత్తున రైతులు బీర్కూర్‌కు చేరుకున్నారు. రైస్‌మిల్ యజమాని, సిబ్బందితో మాట్లాడారు. ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం బాగుండడంతో అందరూ రైస్‌మిల్ సిబ్బందిని నిలదీశారు. ధాన్యం మొలకెత్తిందనీ ఎందుకు అబద్ధాలు చెబుతున్నారని ప్రశ్నించారు. ధాన్యం బాగుండడంతో చేసేది ఏం లేక రైస్‌మిల్లర్లు ధాన్యం బస్తాలు దించుకున్నారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం అయ్యింది.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

దోమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో గురువారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేయబడుతుందని వైద్యులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సంజీవరెడ్డి, యాదయ్య, సత్యం, భూమయ్య, సిద్దరాములు, పాల్గొన్నారు.

కొండాపూర్ విద్యార్థులకు ప్రథమ బహుమతి

రాజంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఏర్పాటు చేసిన యూత్ ఫెస్టివల్‌లో రాజంపేట మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి వచ్చినట్లు గైడ్ టీచర్ అశోక్ తెలిపారు. విద్యార్థులు ఆటోమేటిక్ ఫ్లేసింగ్ అండ్ డోర్ కంట్రోల్ సిస్టం తయారుచేసి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారన్నారు. ఈ ప్రాజెక్ట్ జిల్లాస్థాయిలో ప్రథమస్థాయిలో నిలిచిందని తెలిపారు. గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

లింగంపేట, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఎస్సై దీపక్‌కుమార్ అవగాహన కల్పించారు. సైబర్ జాగరూకత దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి. సైబర్ నేరగాళ్లు బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్‌తో, స్టాక్‌ట్రేడింగ్ పేరుతో, ఐపీవో స్కామ్‌ల పేరుతో ఎలా మోసాలు చేస్తారని ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ నరేందర్, లెక్చరర్లు దుర్గయ్య, శివ, రాజయ్య, అంజయ్య, ధర్‌సింగ్, స్వామిగౌడ్, సంధ్యారాణి, షైమద్, ఆనంద్‌రెడ్డి, అభినవ్, నాగయ్య ఉన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి మాస్ జాతర
వెంకటేశ్వర బాహుబలి (ది ఎపిక్)

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230